ప్రజలకు అండగా 'సాక్షి'

కేఎంసీ కమిషనర్‌తో నేడు 'ఫోన్ ఇన్'



అభిషేక్ అగస్త్య, కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, విషజ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకునేలా 'సాక్షి'ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా కేఎంసీ పరిధిలోని ప్రజలు సీజనల్ వ్యాధుల కట్టడికి చేయాల్సిన పనులు, ఓపెన్ ప్లాట్లలో చెత్త నిల్వలు, డ్రెయినేజీలు, రోడ్లు సరిగ్గా లేకపోవడం తదితర సమస్యలను కమిషనర్ అభిషేక్ అగస్త్య దృష్టికి తీసుకెళ్లవచ్చు.

తేదీ : 17- 07 - 2025, గురువారం
సమయం : ఉదయం 10-30 నుంచి 11-30 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ :
7901298265

సరికొత్త అధ్యాయం..



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ పునుకొల్లు నీరజ

సంపూర్ణ అక్షరాస్యత దిశగా ప్రత్యేక ప్రణాళికలు

- 16,934 మంది నిరక్షరాస్యుల గుర్తింపు
- తొలివిడతలో 120 మందికి బోధన
- ఒక్కో ఆర్పీకి 20 మంది కేటాయింపు
- పైలట్ ప్రాజెక్ట్‌గా 59వ డివిజన్ ఎంపిక

ఖమ్మంమయూరిసెంటర్: సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యంగా ఖమ్మం నగరపాలక సంస్థ అధికారులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నిరక్షరాస్యతను పూర్తిగా నిర్మూలించాలనే సంకల్పంతో చదువురాని వారిని గుర్తించి వారికి చదవడం, రాయడం నేర్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. నగరంలోని 60 డివిజన్ల పరిధిలో నిరక్షరాస్తులైన 18 ఏళ్లు పైబడి వారిని ఆర్పీల ద్వారా గుర్తించారు. గతంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో నిరక్షరాస్యులు 22 వేలకు పైగా ఉన్నట్లు లెక్కలు తేలగా.. ఇటీవల నగరంలో ఆర్పీలతో మరోసారి సర్వే చేయించగా.. 16,934 వేలకు పైగా నిరక్షరాస్యులు ఉన్నట్లు తేలింది. దీంతో మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచనలతో దానవాయిగూడెం, రామన్నపేట ప్రాంతాల్లో నిరక్షరాస్యులకు చదువు చెప్పించేందుకు మెప్మా సిబ్బంది కసరత్తు చేస్తున్నారు.

తొలుత 120 మందికి బోధన..

నగరంలోని నిరక్షరాస్యులకు విద్యను నేర్పించేందుకు చేపట్టాల్సిన చర్యలపై మేయర్ వయోజన విద్యా శాఖ అధికారులు, మెప్మా అధికారులతో సమావేశాలు నిర్వహించారు. దానవాయిగూడెం, రామన్నపేట ప్రాంతాలను పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి ఆరుగురు ఆర్పీలతో 673 మందికి చదువు నేర్పించనున్నారు. తొలి విడతలో ఒక్కొక్కరు 20 మంది చొప్పున 120 మందికి నేర్పించేలా ప్రణాళిక చేస్తున్నారు.

అవసరాలకు అనుగుణంగా..

ఈ బృహత్తర బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు రిసోర్స్ పర్సన్స్(ఆర్పీ)లను రంగంలోకి దించారు. ఈ ఆర్పీలు వయోజన విద్యా బోధనలో ప్రత్యేక శిక్షణ పొంది, నిరక్షరాస్యుల అవసరాలకు అనుగుణంగా బోధనా పద్ధతులను అవలంబిస్తారు. కేవలం అక్షరజ్ఞానానికే పరిమితం కాకుండా, ప్రాథమిక గణితం, రోజువారీ జీవితంలో ఉపయోగపడే ప్రాక్టికల్ నైపుణ్యాలు, సామాజిక అవగాహన వంటి అంశాలను కూడా వీరికి బోధించనున్నారు. ఇది వారిని కేవలం అక్షరాస్యులుగానే కాకుండా, సమాజంలో మెరుగైన జీవనం సాగించేందుకు అవసరమైన పరిజ్ఞానాన్ని పెంపొందించేలా చేస్తుంది.

ఆదర్శంగా నిలిచేలా..

నగరంలో చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమం సంపూర్ణ అక్షరాస్యత సాధన దిశగా ఒక కీలక ముందడుగుగా పరిగణించబడుతోంది. ఇది విజయవంతమైతే ఇతర డివిజన్లకూ విస్తరించి నిరక్షరాస్యత రహిత జిల్లాగా మార్చాలనే ఆకాంక్షను పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఈ రకమైన సామాజిక కార్యక్రమాలు సమాజంలో మార్పునకు నాంది పలకడమే కాకుండా, బలహీన వర్గాల ప్రజల సాధికారతకు దోహదపడతాయి.

రెండు రోజుల్లో ప్రారంభం..

వయోజనుల అక్షరాస్యత తరగతులు మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఇది నిరక్షరాస్యులకు ఒక సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించనుంది. విద్యను అభ్యసించడం ద్వారా వారు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడమే కాకుండా, మెరుగైన ఉపాధి అవకాశాలను పొందడానికి, తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవడానికి ఇది ఎంతగానో సహాయపడుతుంది.

స్వయం ఉపాధికి దోహదం..

18 ఏళ్లు పైబడి చదవడం, రాయడం రాని వారి కోసం ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేయనున్నాం. తొలుత ఆర్పీలతో విద్యా బోధన చేయించి చదువుతో పాటు స్వయం ఉపాధి పొందేందుకు పలు వృత్తులపై శిక్షణ ఇప్పిస్తాం. దీంతో నిరక్షరాస్యుల్లో చదువుకోవాలనే ఆసక్తి కూడా పెరుగుతుంది. ఆసక్తి గల యువత ముందుకొచ్చి విద్యా బోధన చేయొచ్చు.

– పునుకొల్లు నీరజ, కేఎంసీ మేయర్

అటు పచ్చదనం.. ఇటు ఆదాయం



మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య, తదితరులు

ఖమ్మంఅర్బన్: నగరంలో పచ్చదనం పెంచడం, ప్రజలకు ఆహ్లాదం పంచడమే కాక కార్పొరేషన్‌కు ఆదాయం వచ్చేలా మొక్కలు నాటుతున్నామని కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాల్లో నాటుతున్న మొక్కలను ఉద్యానధికారి బెల్లం రాధికతో కలిసి బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కేఎంసీ పరిధిలో రోడ్ల వెంట, డివైడర్ల మధ్యలో వక్క(అరెకానట్) మొక్కలు నాటుతున్నామని తెలిపారు. నగరంలోని 32 కి.మీ. పొడవుతో ఉన్న డివైడర్లలో ఈ మొక్కలను నాటుతున్నట్లు చెప్పారు. శ్రీశ్రీ సర్కిల్ నుంచివిజయ కాలేజీ వరకు 8 కి.మీ. పొడవైన డివైడర్లలో 810 మొక్కలు నాటే ప్రక్రియ చకచకా సాగుతోందని తెలిపారు. వక్క మొక్కలతో పచ్చదనం పెగరడమే కాక కార్పొరేషన్‌కు ఆదాయం సమకూరుతుందని కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



బీరోలు పల్లె దవాఖానాలో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా మలేరియా అధికారి వెంకటరమణ

తిరుమలాయపాలెం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి వెంకటరమణ సూచించారు. బుధవారం మండలంలోని కాకరవాయి గ్రామంలో సుబ్లేడు పీహెచ్‌సీ ఆధ్వర్యాన నిర్వహించిన వైద్య శిబిరాన్ని, బీరోలులో ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జ్వరాల సర్వే, డ్రైడే చర్యలు, డెంగీ నివారణ చర్యలు, సికిల్‌సెల్ స్క్రీనింగ్, ఆరోగ్య డేటా ఆన్‌లైన్ అప్డేషన్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి వాధ్యుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సుబ్లేడు పీహెచ్‌సీ డాక్టర్ వసుంధర, పల్లె దవాఖానా వైద్యురాలు నిరీషా, పంచాయతీ కార్యదర్శి అంజి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం, వసతి కల్పించాలి



వసతులపై ఆరా తీస్తున్న తహసీల్దార్ రాంప్రసాద్

ఖమ్మంరూరల్: కేజీబీవీ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని తహసీల్దార్ పి.రాంప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని నాయుడుపేటలో గల కేజీబీవీ విద్యాలయాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నందున ప్రభుత్వ లక్ష్య సాధనకు అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పని చేయాలని తెలిపారు. ఈమేరకు విద్యాలయంలో తాగునీటి వసతి, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సేవలు అభినందనీయం..



నోట్‌బుక్స్ అందిస్తున్న సేవా సమితి బాధ్యులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్, గొల్లగూడెం జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో విద్యార్థులకు రూ.10వేల విలువైన నోట్ బుక్స్‌ను వాసిరెడ్డి సేవా సమితి ఆధ్వర్యాన అందజేశారు. ఈ సందర్భంగా 14వ డివిజన్ కార్పొరేటర్ కూరాకుల వలరాజు మాట్లాడుతూ.. వాసిరెడ్డి సేవా సమితి ప్రతీ ఏడాది 20 పాఠశాలలను ఎంపిక చేసి, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు అందిస్తుండడం అభినందనీయమన్నారు. హెచ్ఎం ప్రమీలారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జానీమియా, దస్తగిరి, నాగేశ్వరరావు, టీచర్లు రవికిరణ్, రాంప్రసాద్, బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు అందజేత..



బ్యాగులు అందిస్తున్న ఎంఈఓ చలపతిరావు

నేలకొండపల్లి: మండలంలోని కట్టుకాచారం పాఠశాల విద్యార్థులకు చేతన ఫౌండేషన్, స్థానిక పాఠశాల ఉపాధ్యాయుడు ఇటిక్యాల సురేష్‌లు సంయుక్తంగా స్కూల్ బ్యాగ్‌లను అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బి.చలపతిరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావడం అభినందనీయమని పేర్కొంటూ దాతలను సన్మానించారు. ఫౌండేషన్ ప్రతినిధులు ఎం.సురేష్, నవీన్, రషీద్, డి.సీతారామయ్య, హెచ్ఎం రాందాసు, నారాయణ, సురేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న గుడిపూడి శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రొగ్రెసివ్ రెకగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ) కృషి చేస్తుందని ఖమ్మం అర్బన్ మండల అధ్యక్షుడు గుడిపూడి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బి.రవికిరణ్‌లు అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల పరిధిలోని పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు, ఇంక్రిమెంట్లు, పదోన్నతులు, బదిలీలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, సేవా సమస్యల పరిష్కారమే తమ యూనియన్ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు రమణ, నాగిరెడ్డి, ప్రసాద్, శ్రీనివాసరావు, ఎస్.వెంకన్న, మలీదు రాములు, రంగారావు, ఆదినారాయణ, సాంబశివరావు, రామకృష్ణ, అచ్యుతరావు, మురళీకృష్ణ, నవీన్ కుమార్, రాంబాబు, వెంకటకుమారి, సునీత, జయ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను అజెండాలో చేర్చాలి



మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కార్పొరేషన్‌లో పని చేస్తున్న 16 మంది కార్మికులను కేఎంసీ నేరుగా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో తీసుకునే అంశాన్ని అజెండాలో చేర్చాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఖమ్మం కార్పొరేటర్ బీజీ క్లైమెంట్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు బుధవారం మేయర్ పునుకొల్లు నీరజను కలిసి వినతిపత్రం అందించాడు. ఈ సందర్భంగా క్లైమెంట్ మాట్లాడుతూ గతంలో పబ్లిక్ హెల్త్ లో పనిచేసి ప్రస్తుతం మిషన్ భగీరథ వాటర్ ఫిల్టర్ ఆపరేటర్లు, పంపు ఆపరేటర్లు, లీకేజీ వర్కర్లుగా పని చేస్తున్న 16 మంది కార్మికులకు 2024 ఫిబ్రవరి 3న జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఇచ్చిన హామీ మేరకు కేఎంసీలోకి తీసుకోవాలని కోరారు. త్వరలో జరగబోయే జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాన్ని అజెండాగా పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్కర్లు జి.మహేష్, వేముల హరీష్, పి.వెంకటేశ్వర్లు, ఎస్.మహేష్, శివకృష్ణ, గురుమూర్తి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' ఇళ్ల పత్రాల అందజేత

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక గ్రామంలో మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను బుధవారం గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులు అందించారు. మొత్తం 20 మంది లబ్ధిదారులకు మంజూరు కాగా, రెండో విడత మరో 15 రోజుల్లో పంపిణీ చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ రాంప్రసాద్, చెరుకూరి పూర్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాధంశెట్టి హనుమంతురావు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం స్పెషల్ బ్రాంచ్ సీఐగా రామకృష్ణ

ఖమ్మం క్రైం: ఖమ్మం స్పెషల్ బ్రాంచ్ సీఐగా జె.రామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఆయన ఐజీ అటాచ్‌మెంట్‌లో ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే కుటుంబంలో మరో విషాదం

రఘునాథపాలెం: వైరా మాజీ ఎమ్మెల్యే, మండలంలోని ఈర్లపుడికి చెందిన బానోత్ మదన్‌లాల్ ఇంట్లో మరో విషాదం చోటు చేసుకుంది. కొన్నాళ్ల క్రితం మదన్‌లాల్ సోదరుడు, ఇటీవల మదన్‌లాల్ గుండెపోటుతో మృతి చెందిన విషయం విదితమే. ఇక మంగళవారం రాత్రి ఆయన బాబాయి కుమారుడు భానోత్ ధర్మయ్య(60) సైతం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన ఒంట్లో నలతగా ఉందని చెప్పడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణం కోల్పోయారు. ధర్మయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ధర్మయ్య మృతదేహంవద్ద నివాళులర్పించారు.

చిరస్మరణీయుడు 'రాయల'

ఖమ్మం మామిళ్లగూడెం: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు రాయల చంద్రశేఖర్ మరణం రైతాంగ ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవుల అశోక్ అన్నారు. బుధవారం చంద్రశేఖర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించాక మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్న నేటి పరిస్థితుల్లో వామపక్ష ఉద్యమాలు చేపట్టేందుకు ఆయన పోరాట మార్గంలో పయనించినప్పుడే వర్గ పోరాట నివాళికి అర్థం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొల్లేటి నాగేశ్వరరావు, ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, నాయకులు కిరణ్, రామకృష్ణ, ఆజాద్, వెంకటేష్, సత్తార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మం అర్బన్: ఈ నెల 19, 20 తేదీల్లో మధిరలో జరగబోయే సీపీఐ 23వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పగడాల మల్లేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో బాగం ప్రసాద్ అధ్యక్షతన రఘునాథపాలెం మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయాన ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. మండలంలో ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఉద్యమాలు జరిపేలా పార్టీ శ్రేణులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ మండల సహాయ కార్యదర్శి లచ్చిరాం, జామ్లా, చీనా, రావెళ్ల సురేష్, సత్యనారాయణ, నాదం, కురువెళ్ల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డు నిర్మించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం సారథినగర్ రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి గాంధీచౌక్ వరకు వెళ్లేందుకు అప్రోచ్ రోడ్డు నిర్మించాలని, మాజీ కౌన్సిలర్ సింగం అంజయ్య, సిటీ కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ 46వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బాణాల లక్ష్మణ్ కోరుతూ బుధవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాధ్యసాధ్యాలను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా రోడ్డు నిర్మించాలని వివరించారు. రైల్వే అండర్ బ్రిడ్జ్ గుండా నిర్మించిన అప్రోచ్ రోడ్డు నిర్మాణంపై మంత్రి తుమ్మలకు 46 డివిజన్ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. వినతి అందించిన వారిలో ఏటుకూరి కృష్ణప్రసాద్, 46వ డివిజన్ బీసీ సెల్ అధ్యక్షుడు తుపాకుల మధు తదితరులు పాల్గొన్నారు.

'వ్యవసాయ కూలీలపై పాలకుల చిన్నచూపు'

నేలకొండపల్లి: వ్యవసాయ కూలీలపై పాలకులు చిన్నచూపు చూస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడారు. కూలీల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మరింత ఒత్తిడి తీసుకొచ్చేలా ఉద్యమాలు చేపట్టాలన్నారు. అనంతరం సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకోగా అధ్యక్షుడుగా దుగ్గి నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా పెద్దపాక మల్లేశ్వరరావులతో పాటు మరో 18 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సభలో జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రా శ్రీనివాసరావు, ప్రసాద్, రచ్చా నరసింహారావు, కట్టికోల వెంకటేశ్వర్లు, పెరుమాళ్ల, దుగ్గి జానమ్మ, పద్మ, ఎడవల్లి సైదమ్మ, కొప్పుల జానకీ, గాదె వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల ఆత్మీయ సమ్మేళనం

నేలకొండపల్లి: అర్హత కలిగిన కళాకారులకు పెన్షన్ ఇవ్వాలని సకల కళల పరిరక్షణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్‌పాండే డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన కళాకారుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కళాకారులకు గుర్తింపు కార్డులు అందించి హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఆతర్వాత హైదరాబాద్ అదనపు డీసీపీ (ట్రాఫిక్) తేజావత్ రామదాసు మాట్లాడుతూ.. కళల పరిరక్షణకు కళాకారులకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు తునికిపాటి లక్ష్మణ్‌చారి, తెల్లగొర్ల లింగస్వామి, తేజావత్ భిక్షం, సత్యనారాయణ, చిలకబత్తిని వీరబాబు, అంజయ్య, మమత, వడ్డె జగన్, బొడ్డు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పేషెంట్లు..

పెద్దాస్పత్రిలోని జనరల్ ఆస్పత్రిలో ఔట్ పేషంట్ సేవల వద్ద పేషంట్లు నానా అగచాట్లు పడుతున్నారు. మొదటి అంతస్తులో పలు విభాగాలు ఉండగా.. పైకి వెళ్లేందుకు ర్యాంపు లేకపోవడంతో మెట్ల మార్గాన వెళ్లేందుకు వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యాన నడవలేని స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలు పైఅంతస్తుకు వెళ్లి మెట్లపై నుంచి దిగలేక ఇదిగో ఇలా పాక్కుంటూ కిందకు దిగుతున్న దృశ్యమే ఇది.. - ఖమ్మం వైద్యవిభాగం



మెట్లపై అవస్థలు పడుతూ దిగుతున్న వృద్ధురాలు

క్లుప్తంగా

బచ్చోడు పాఠశాలలో అడ్మిషన్లు 'ఓపెన్'

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడు జిల్లా పరిషత్ పాఠశాలలో ఓపెన్ టెన్త్, ఇంటర్ కేంద్రాలు మంజురైనట్లు పాఠశాల హెచ్ఎం బి.కృష్ణమోహన్ తెలిపారు. బుధవారం పాఠశాలలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అడ్మిషన్ల కోసం ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశాలకు టీసీ, బర్త్, కులం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో పాటు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో అందించాలని, మరిన్ని వివరాలకు 99495 46150 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బదిలీ



ఆర్ఐను సన్మానిస్తున్న తహసీల్దార్, తదితరులు

తిరుమలాయపాలెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించిన రేసు వీరయ్య ఖమ్మం కలెక్టరేట్‌లోని డీఎస్ఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో డీఎస్ఓ కార్యాలయంలో పని చేస్తున్న పవన్ తిరుమలాయపాలెం ఆర్ఐగా నియమితులయ్యారు. బుధవారం ఈ మేరకు ఆర్ఐ వీరయ్యను తహసీల్దార్ లూథర్ విల్సన్, డీటీ సుధీర్, ప్రజా సంఘాల నాయకులు ఇజ్రాయిల్, శ్రీనివాసరెడ్డి తదితరులు శాలువాతో సన్మానించి మరిన్ని మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు.

సామాజిక సేవా అవార్డు గ్రహీతకు సన్మానం



బాబురావును సన్మానిస్తున్న అదనపు డీసీపీ

నేలకొండపల్లి: సామాజిక సేవా జాతీయ అవార్డు గ్రహీత బొడ్డు బాబురావును బుధవారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ అదనపు డీసీపీ(ట్రాఫిక్) తేజావత్ రామదాసు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దివ్యాంగుడైన బాబురావు చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. 52 సార్లు రక్తదానం చేయడం, విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించడం, కరోనా సమయంలో నిత్యావసరాలు అందించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో తెల్లగొర్ల లింగస్వామి, నాగేశ్వరరావు, చిన్ని కృష్ణయ్య, తేజావత్ భిక్షం, కొమ్ము రమ, తార తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలి


కామేపల్లి: పండ్ల తోటల పెంపకంపై రైతులు దృష్టి సారించేలా వారిని ప్రోత్సహించాలని కల్లూరు క్లస్టర్ ఏపీడీ చలపతిరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఈజీఎస్ కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు జామ, నిమ్మ, మామిడి, ఆయిల్ పామ్, డ్రాగన్ ఫ్రూట్, మునగ సాగుకు ఈజీఎస్ ద్వారా ఉచితంగా మొక్కలను అందించడంతో పాటు నాటించనున్నట్లు తెలిపారు. వనమహోత్సవంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా విరివిరిగా మొక్కలను నాటేందుకు తగు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీరాణి, ఈసీ వెంకటేశ్వరరావు, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



ఒరిగిన స్తంభాలు.. | పెరిగిన భయాలు





మండలంలోని రఘునాథపాలెం–పాపడపల్లి రోడ్డులో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. హైటెన్షన్ విద్యుత్ లైన్ కోసం ఏర్పాటు చేసిన స్తంభాలు రహదారి పక్కనే తీగలతో సహా ఒరిగి ఉన్నాయి. దాని సమీప ప్రాంతంలో వ్యవసాయ మోటార్‌కు వెళ్లే మరో విద్యుత్ లైన్ కూడా ప్రమాదాన్ని ఆహ్వానిస్తున్నాయి. ఎటువంటి ప్రమాదాలు జరగక ముందే విద్యుత్ శాఖ అధికారులు మేల్కొని ఒరిగిన స్తంభాలను పునరుద్ధరించి, హైటెన్షన్ లైన్లను సక్రమంగా అమర్చేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. – రఘునాథపాలెం